నేడు లైఫ్ సపోర్ట్ స్కిల్స్‌పై శిక్షణ

శంషాబాద్: కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బేసిక్ లైఫ్ సపోర్ట్ స్కిల్స్‌పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రముఖ కార్డియాలజిస్ట్ మల్‌రెడ్డి హన్మంతురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శంషాబాద్ పట్టణంలోని ఎంఎంఆర్ కన్వెన్షన్ హాలులో ఈ శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ జయప్రకాష్ నారాయణ హాజరుకానున్నట్లు తెలిపారు.

ఘనంగా అయ్యప్ప మహాపడి పూజ


అత్తాపూర్‌లో నిర్వహించిన అయ్యప్ప స్వామి మహాపడి పూజలో పాల్గొన్న భక్తులు

అత్తాపూర్: అయ్యప్ప స్వామి నామస్మరణతో అత్తాపూర్ ప్రాంతం మారుమోగింది. శ్రీ సీతా రాంజనేయ, అయ్యప్ప, సాయినాథ దేవాలయంలో అత్తాపూర్‌కు చెందిన కొండకళ్ల కుటుంబ సభ్యులు మంగళవారం అయ్యప్ప స్వామి మహాపడి పూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి పండ్లు, పూలు, నూతన వస్త్రాలను నైవేద్యంగా సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన భిక్షలో అయ్యప్ప స్వాములు పాల్గొని తీర్థప్రసాదాలనుస్వీకరించారు.

అభివృద్ధి పనుల ప్రారంభం


అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ, మంచిరేవుల గ్రీన్‌ల్యాండ్ కాలనీలో రూ. 50 లక్షలతో సీసీ రోడ్డు, ఇందిరమ్మ కాలనీలో రూ. 50 లక్షలతో డ్రైనేజీ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు అవసరమైన అన్ని రకాల పనులను చేపట్టేందుకు ప్రణాళికలతో పనిచేస్తున్నామన్నారు. అందులో భాగంగా ఇప్పటికే అనేక వార్డులలో అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లంకల పద్మవీరారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ లంకల పాపిరెడ్డి, నాయకులు డి.లక్ష్మణ్, జి.శ్రీరాములు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న ఆలిండియా క్రాఫ్ట్ మేళా



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న ఆలిండియా క్రాఫ్ట్ మేళాలో సందర్శకులు పలు ఉత్పత్తు లను కొనుగోలు చేస్తున్నారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా మంగళవారం శాంతి చంద్రిక వరవీణా మ్యూజిక్ అకాడమీ బృందం స్వరాంజలి అందరిని ఆకట్టుకుంది. చంద్రశేఖర్ శిష్యబృందం కూచిపూడి నృత్య ప్రదర్శనతో సందర్శకులను ఆకట్టుకున్నారు. ఇందులో గజవదన, శివాష్టకం, కామాక్షిస్తుతి, బాలగోపాల, తరంగం, చంద్రశేఖరం, తక్కువేమి మనకు, మరకతమణిమయ, తదితర అంశాలను కళాకారులు ఐశ్వర్య, భావన, మేఘన, హరిప్రియ, హర్షిని, ప్రీతిక, శ్రీవిద్య, సౌమ్య, మనస్వీ తదితరులు ప్రదర్శించారు.

యువకుడి ఆత్మహత్య

మియాపూర్: ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సిద్దిపేట జిల్లా కల్లకుంట కాలనీకి చెందిన తాటోజు రాములు కుమారుడు వేణు(30) ఆర్కిటెక్ట్. ఈ నెల 6వ తేదీన వేణు ప్రాజెక్టు నిమిత్తం నగరానికి వచ్చి మియాపూర్ యూత్ కాలనీలోని స్నేహితుడి రూంలో ఉంటున్నాడు. సోమవారం సాయంత్రం స్నేహితుడు సినిమాకు వెళ్లి రాత్రి 7.30 గంటల సమయానికి రూమ్‌కి వచ్చి చూడగా వేణు ఫ్యాన్‌కు బెడ్‌షీట్‌తో ఉరేసుకుని కనిపించాడు. వేణుగోపాల్ ఇచ్చిన సమాచారం మేరకు మియాపూర్ పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకున్నారు. స్థానికుల సహాయంతో తలుపులు బద్దలు కొట్టి చూడగా వేణు అప్పటికే మృతి చెందాడు. మృతుడి అన్నకు సమాచారం అందించారు. గత కొంతకాలంగా వేణు వ్యాపార నిమిత్తం అప్పులు చేశాడని, అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని మృతుడి సోదరుడు పోలీసులకు తెలిపారు.


నార్సింగిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపిన బీఆర్‌ఎస్ నాయకులు


నెక్నాంపూర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చిన బీఆర్‌ఎస్ నాయకులు


శంషాబాద్: అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న సతీష్, ఎం.శ్రీనివాస్

రైతుల అరెస్టుపై బీఆర్‌ఎస్ నిరసనలు

మణికొండ: కాలుష్యకారక పరిశ్రమలకు తమ భూములు ఇవ్వబోమన్న లగచర్ల రైతులపై అడ్డగోలు కేసులు పెట్టి జైలులో వేయటం, గుండెపోటు వచ్చిన రైతు చేతులకు బేడీలు వేసి ఆసుపత్రికి తీసుకెళ్లటం ప్రభుత్వానికి సిగ్గు చేటని బీఆర్‌ఎస్ నాయకులు విమర్శించారు. ఆ రైతులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నార్సింగి, నెక్నాంపూర్‌ల్లోని అంబేడ్కర్ విగ్రహాలకు వారు మంగళవారం వినతిపత్రాలను అందించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ధన్‌రాజ్, ప్రధాన కార్యదర్శి జి.నరేందర్, నార్సింగి మున్సిపాలిటీ పార్టీ ఇన్‌చార్జి విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రైతులపై పెట్టిన అక్రమ కేసులను తొలగించే వరకు బీఆర్‌ఎస్ పార్టీ వారికి అండగా నిలిచి పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఫరూఖ్, జితేందర్, నర్సింహా, నాగరాజు, ప్రియదర్శిని, దర్శన్, లక్ష్మయ్య, జి.విఠల్, ఎస్. శ్రీకాంత్, ఎ.లక్ష్మణ్‌రావు, యాలాల కిరణ్, బి.శ్రీధర్, బాలాజీ, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక విధానాలు మానుకోవాలి

అత్తాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ప్రజా, రైతు వ్యతిరేక విధానాలు మానుకోవాలని అత్తాపూర్ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అప్పారెడ్డి ముఖేష్ అన్నారు. లగచర్ల రైతులకు సంఘీభావంగా అత్తాపూర్‌లో బీఆర్‌ఎస్ నాయకులు పాశం నరేందర్, పుప్పాల లక్ష్మణ్ తదితరులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం రాజేంద్రనగర్ చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అధికార దాహంతో ఏమి చేస్తున్నారో తెలియని పరిస్థితిలో కాంగ్రెస్ నేతలు ఉన్నారని, వారి అహంకారాన్ని దించే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు.

కాంగ్రెస్‌కు సద్బుద్ధి ప్రసాదించాలని వినతి

బండ్లగూడ: రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి సద్బుద్ధిని ప్రసాదించాలని కోరుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు రావుకోల్ల నాగరాజ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టి థర్డ్ డిగ్రీ ప్రయోగించిన, రైతన్నల చేతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ, అమానవీయ, అణిచివేత విధానాలను ప్రజలందరూ ఖండించాలన్నారు. అనంతరం ఆరె మైసమ్మ మొయిన్ రోడ్డు, పరమేష్ కేఫ్ చౌరస్తా వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి, కార్పొరేషన్ 16వ డివిజన్ ఇన్‌చార్జీ వి.రాముదు యాదవ్, నాయకులు చంద్రరావు, వెంకటేష్, పెంటయ్యయాదవ్, పెంటయ్య, ఇస్మాయిల్, కీర్తికాంత్, మహేష్, మల్లేశ్వరి, వినోద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దురుద్దేశంతోనే కేసులు

మైలార్‌దేవ్‌పల్లి: లగచర్ల రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఏదో విధంగా కేసులు బనాయించి ముప్పుతిప్పలు పెట్టాలని చూస్తోందని బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ ఎస్. వెంకటేష్ ఆరోపించారు. రైతులకు బేడీలు వేసి కోర్టుకు తీసుకువెళ్తూ నానా ఇబ్బందులు పెడుతున్న రేవంత్‌రెడ్డి సర్కారుకు నిరసనగా వాంబే కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ చేసిన అభివృద్ధి పనులకు కాంగ్రెస్ పాలకులు రిబ్బన్ కట్టింగులు చేస్తూ గొప్పలు చెప్పుకుంటున్నారని పేర్కొన్నారు. కల్యాణలక్ష్మితోపాటు తులం బంగారం, 18 ఏళ్లు నిండిన నిరుద్యోగ యువతకు రూ.2,500, రైతుబంధు 15 వేలు, పెన్షన్ 4 వేలు ఇస్తామన్న హామీలు ఏమైపోయాయని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు రమేష్ ముదిరాజ్, రాఘవేందర్ యాదవ్, మైసిరెడ్డి ముదిరాజ్, లక్ష్మిరాజ్, సరిత, మహేష్ నేత, కార్తీక్ ముదిరాజ్, సోమ సందీప్ గుప్తా, వెంకటేష్, నేత, భాస్కర్, చంద్రశేఖర్, మహేందర్ ముదిరాజ్, రిషి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.


బండ్లగూడ: అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న రావుకోల్ల నాగరాజ్ తదితరులు


అత్తాపూర్: అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న అప్పారెడ్డి ముఖేష్ తదితరులు


మైలార్‌దేవ్‌పల్లి: వాంబే కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

లగచర్ల రైతులను విడుదల చేయాలి

శంషాబాద్: లగచర్ల రైతులను వెంటనే విడుదల చేయాలని బీఆర్‌ఎస్ నేతలు డిమాండ్ చేశారు. పార్టీ పిలుపు మేరకు మంగళవారం లగచర్ల రైతుల అరెస్టులకు నిరసనగా అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ సీనియర్ నేతలు బి.సతీష్, మంచర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులను వంచిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. రైతులకు సంకెళ్లు వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి రైతులపై ఏమాత్రం ప్రేమ లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు మంచర్ల మోహన్‌రావు, రాజేందర్, అశోక్, గుంటి చరణ్, ఆర్.రమేష్, రాజునాయక్, పరంధాములు, రాజు, జగదీశ్వర్‌గౌడ్, శ్రీకాంత్, శ్రీశైలం, శ్రీనివాస్, నర్సింహా, అర్జున్, వెంకటేష్, మురళి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతి

రాజేంద్రనగర్: లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టి థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైళ్లలో నిర్బంధించిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే క్షమాపణ చెప్పి వెంటనే విడుదల చేయాలని రాజేంద్రనగర్ బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ధర్మారెడ్డి డిమాండ్ చేశారు. రైతన్నలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తేసి వారిని వెంటనే విడుదల చేయాలని మంగళవారం రాజేంద్రనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిప్రతం అందజేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఉద్యమ నాయకులు ప్రీతంరాజ్, నవీన్ కుమార్, కవేలిగూడం గిరిబాబు, బండ్ల నరేందర్, ఉమారెడ్డి, మహ్మద్ ఆద్రిస్, కట్టెలమండి గౌతం, నరేశ్ ముదిరాజ్, అష్ఫక్, శ్రీను, సారంగపాణి, శ్రీను కాకా, కమల్, అక్బర్, సురేశ్, మారి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.


రాజేంద్రనగర్: అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న ధర్మారెడ్డి తదితరులు

'ఇందిరమ్మ' సర్వేను వేగంగా పూర్తిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శరత్‌చంద్ర

సమీక్షా సమావేశంలో బండ్లగూడ జాగీరు మున్సిపల్ కమిషనర్

బండ్లగూడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర అన్నారు. మంగళవారం కార్పొరేషన్ పరిధిలోని హిమాయత్‌సాగర్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌ఆర్‌ఎస్ సర్వే చేపట్టాలని, ఆస్తి పన్నులు సక్రమంగా వసూలు చేయాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. ట్రేడ్ లైసెన్స్, వాణిజ్య ప్రకటనల రుసుములు వసూలు చేయాలని సూచించారు. ఇంజనీరింగ్ విభాగంలో వివిధ అభివృద్ధి పనులను వేగవంతంగా నిర్వహించాలన్నారు. శానిటేషన్, ఇంటింటా చెత్త సేకరణ పనులపై ప్రత్యేక దృష్టిసారించాలని పేర్కొన్నారు. వన మహోత్సవం కార్యక్రమానికి నర్సరీలో మొక్కల పెంపకం ప్రారంభించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వార్డు అధికారులు, సూపర్‌వైజర్లు, బిల్ కలెక్టర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, రిసోర్స్ పర్సన్స్, శానిటరీ జవాన్లు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

అత్తాపూర్: విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో పాలుపంచుకున్నప్పుడు విజ్ఞానవంతులుగా ఎదుగుతారని అత్తాపూర్ పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ కోడూరు అన్నపూర్ణ అన్నారు. అత్తాపూర్‌లోని ఉక్మస్ అబాకస్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని సత్తాచాటారు. ఈ పోటీల్లో 30కిపైగా దేశాల నుంచి 6 వేల మంది విద్యార్థులు పాల్గొనగా అత్తాపూర్ పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన నందూరి ఇషాన్ ఐఎస్‌సిలో రన్నరప్ 3, ఎస్ఎల్‌సీ మెరిట్‌లో ట్రోఫీలను గెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వారిని అభినందించారు. అత్తాపూర్‌లోని ఉక్మస్ అబాకస్‌కు చెందిన తిరునగిరి వేదాన్ష్ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చాంపియన్ ట్రోఫీని గెలుచుకున్నారన్నారు. తిరునగిరి చేతన్ ఐఎల్సీలో రన్నరప్ 2, ఎస్ఎల్సీ మెరిట్ ట్రోఫీలను గెలుచుకున్నారన్నారు. అవార్డులు సాధించిన వారిని ఉపాధ్యాయులు అభినందించారు.



ట్రోఫీ అందుకుంటున్న అత్తాపూర్ ఉక్మస్ అబాకస్ విద్యార్థులు

పెన్షనర్ల భవనం ప్రారంభం

బండ్లగూడ: రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్‌లో రూ.90 లక్షలతో నిర్మించిన పెన్షనర్స్ భవనాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 17న పెన్షనర్స్ డే సందర్భంగా ఈ భవనం ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. సీనియర్ సిటిజన్స్ సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు. అనంతరం సంఘం సభ్యులందరినీ ఆయన శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్, మేయర్ లతాప్రేమ్‌గౌడ్, కమిషనర్ శరత్‌చంద్ర, కార్పొరేటర్లు నిఖిల సంగారెడ్డి, సాగర్‌గౌడ్, అస్లాం బిన్ అబ్దుల్లా, నాయకులు సురేష్‌గౌడ్, కృష్ణారెడ్డి, మాలకీ రత్నం, సుమన్‌గౌడ్, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.


కిస్మత్‌పూర్‌లో పెన్షనర్స్ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

టిఫిన్ తీసుకువస్తానని బయటకు వెళ్లి...


వివేక్ (ఫైల్)

అత్తాపూర్: టిఫిన్ తీసుకువస్తానని ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటరామిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... పాండురంగానగర్ ప్రాంతానికి చెందిన సునీల్ పంజాగుట్టలో ఉన్న నీటి పారుదల శాఖలో అటెండర్. సునీల్, రీతూ దంపతుల కుమారుడు వివేక్(21) ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. ఇటీవల జరిగిన పరీక్షకు గైర్హాజరు కావడంతో తండ్రి అతడిని మందలించాడు. ఈ నేపథ్యంలోనే వివేక్ అదృశ్యమయ్యాడు. దీంతో కుటుంబసభ్యులు చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికినా, బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేసినా ఆచూకీ తెలియరాలేదు. కేసు దర్యాప్తులో ఉంది.

భక్తిభావంతోనే మనశ్శాంతి


పూజల్లో బీజేపీ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: భక్తిభావాన్ని కలిగి ఉన్నప్పుడే మనశ్శాంతి దక్కుతుందని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బాపుఘాట్‌లోని శ్రీ రామచంద్ర ఆలయంలో శ్రీశ్రీ మహంత్ రాహుల్‌దాస్ మహరాజ్, సంఘం పీఠాధిపతి రామరాజ్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీ రామ స్వర్ణ పాదుకల పల్లకీ పాదయాత్ర మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తోకల శ్రీనివాస్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మట్లాడుతూ భాగ్యనగర్ నుంచి అయోధ్య వరకు 14 రోజుల పాదయాత్ర విశిష్టత లోక కల్యాణార్థం చేపట్టబోతున్నారని అన్నారు. ఇక్కడి నుంచి పల్లకీలో తీసుకెళ్లి శ్రీరామ స్వర్ణ పాదుకలను అయోధ్యలో సమర్పించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా రామరాజ్యం ఫౌండేషన్, రామరాజ్యం సెంట్రల్ ట్రస్ట్‌ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

బండ్లగూడ: విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం 1104 యూనియన్ నిరంతరం కృషి చేస్తుందని ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.సాయిబాబా అన్నారు. మంగళవారం విద్యుత్ ఉద్యోగుల 1104 సంఘం రాజేంద్రనగర్ డివిజన్ ఎన్నికలు బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్ పూర్ణగార్డెన్‌లో జరిగాయి. నూతన అధ్యక్షుడిగా శ్రీహరి, ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ అజీమ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డి.శ్రీను, అడిషనల్ సెక్రటరీగా రమణ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో డిస్కం యూనియన్ ప్రెసిడెంట్ ఎ.వేణు, అడిషనల్ సెక్రటరీ ఎం.భాస్కర్‌రెడ్డి, రీజినల్ సెక్రటరీ సుజత్‌హుస్సేన్, రీజనల్ సెక్రటరీ లక్ష్మీనారాయణగౌడ్, రిజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్ రామ్‌శెట్టి శేషయ్య, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ జీ.వి.బాబురావు తదితరులు పాల్గొన్నారు.


పూర్ణ గార్డెన్‌లో నిర్వహించిన యూనియన్ సమావేశంలో సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

కరాటే విజేతలకు ఎమ్మెల్యే అభినందన


కరాటేలో పతకాలు సాధించిన బీఎస్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్: ఇటీవల జరిగిన తంగిల్ మూడో మార్షల్ ఆర్ట్స్ పదో జాతీయ చాంపియన్‌షిప్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన శంషాబాద్‌కు చెందిన బీఎస్ మార్షల్ ఆర్ట్స్ అకాడమి విద్యార్థులను ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. కౌన్సిలర్ మేకల వెంకటేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో కరాటే కోచ్ భగవాన్ దాస్ నాయక్ విద్యార్థుల బృందం మంగళవారం ప్రకాష్‌గౌడ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కరాటే నేర్చుకుంటే ఆత్మరక్షణతో పాటు మానసిక ధైర్యం పెరుగుతుందన్నారు. తల్లిదండ్రులు తమ కుమార్తెలకు కూడా కరాటే శిక్షణ ఇప్పించాలని సూచించారు.

విధి నిర్వహణలో జాగ్రత్తలు అవసరం

బండ్లగూడ: పారిశుద్ధ్య కార్మికులు విధినిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. మంగళవారం ఉదయం 9వ డివిజన్‌లోని భారత్‌నగర్ కాలనీ, 12వ డివిజన్‌లోని ఆనంద్‌నగర్ కాలనీ, 14వ డివిజన్‌లోని ఇందిరారెడ్డి నగర్ కాలనీల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. ప్రతీ రోజు ఉదయాన్నే ప్రధాన రహదారులను శుభ్రం చేయాలన్నారు. విధులు నిర్వహించే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, మాస్కులు, గ్లౌజులు, రిఫ్లెక్టింగ్ జాకెట్స్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ జవాన్లు జగన్‌మోహన్‌రావు, మీర్జా తౌఫిక్, యాదగిరి, సుభాష్, రాము తదితరులు పాల్గొన్నారు.


భరత్‌నగర్ కాలనీలో స్వీపింగ్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర